

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

నల్గొండ యాదాద్రి సూర్యాపేట

ఆదివారం 15, జూన్ 2025 పేజీలు - 8

## సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రవేశాల గోడపత్రిక విడుదల

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ జిల్లా బ్యూరో**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల, చర్లపల్లి, నల్లగొండ కళాశాల యందు 2025-26 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం కావడం జరిగింది. ఇందుకు సంబంధించిన గోడ ప్రతిని నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవనీయులు ఇలా త్రిపాఠి ఆవిష్కరించారు. అర్హులైన మహిళా విద్యార్థులు జూన్ 23 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న కోర్సులు – బీఎస్సీ (బిజెడ్సి, ఎంజెడ్సి,ఎంపీసీ,ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్, ఏంఎస్డిఎస్), బీకాం (బిఏ, సీఏ), బిఏ(హెచ్ఈపి). దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పదవతరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ,5 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటుగా జనవరి 2025 తర్వాత పొందిన తాజా ఆదాయ ధృవీకరణ పత్రం ( గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 1,50,000/రూ.లోపు పట్టణ ప్రాంతాలకు చెందిన వారు 2 లక్షల రూపాయల లోపు ఉండాలి.) ఈ దరఖాస్తులను జత చేసి నేరుగా జూన్ 23 లోపు కళాశాలలో అందజేయాలని కలెక్టర్ తెలిపారు. గోడ ప్రతి ఆవిష్కరణలో ఎస్పీ రాజ్ కుమార్ (ప్రాజెక్ట్ డైరెక్టర్, హౌసింగ్ నల్లగొండ), కళాశాల ప్రిన్సిపాల్ డా. పవిత్ర వాణికర్ష మరియు కళాశాల అడ్మిషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పురస్కారాలకు...

# ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నల్గొండ జిల్లా బ్యూరో**

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాలైన పద్మ పురస్కారాలకు అర్హులైన వారి నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ అవార్డులు భారతదేశంలో అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటని,ఈ అవార్డులను 1954 సంవత్సరంలో ప్రారంభించడం జరిగిందని, ఈ పురస్కారాలను ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక సేవ, సైన్స్, ఇంజనీరింగ్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీస్, వాణిజ్యం మరియు పరిశ్రమలు మొదలైన రంగాలలో విశిష్ట సేవలు అందించి విజయాలు సాధించిన వారికి ఈ అవార్డులు ఇస్తారని ఆమె తెలిపారు. జాతి, వృత్తి, లింగ బేధం లేకుండా అందరూ ఈ అవార్డులకు అర్హులని, 2026 సంవత్సరానికి ఇచ్చే ఈ పద్మ అవార్డుల కోసం నామినేషన్లు/సిఫార్సులను రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా స్వీకరించబడతాయని వెల్లడించారు. నామినేషన్లను జూలై 31, 2025 లోగా పైన పేర్కొన్న పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఫార్మాట్‌లో, గరిష్టంగా 800 పదాలకు మించకుండా వివరణాత్మక కథనం రూపంలో పంపించాలని తెలిపారు. అవార్డ్ కు ప్రతిపాదిస్తున్న వ్యక్తి యొక్క విశిష్టమైన మరియు అత్యుత్తమ సేవ/కృషిని స్పష్టంగా తెలియజేయాలని, ఆన్‌లైన్లో నామినేషన్లు పంపడానికి అవసరమైన సూచనలు https://awards.gov.in పోర్టల్లో అందుబాటులో ఉన్నాయని, అలాగే నియమ నిబంధనలు పద్మ అవార్డుల వెబ్‌సైట్ : https://padmaawards.gov.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నామినేషన్ల ఖరారు సమయంలో ప్రతిపాదిత వ్యక్తులు జీవితకాలం పాటు చేసిన కృషికి అత్యంత ప్రశంసనీయులని నిర్ధారించే అంశాలు,సమాజానికి వారి సేవ మరియు సాధనలలోని గొప్పతనం పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పద్మ అవార్డు దేశంలో రెండవ అత్యున్నత పౌర పురస్కారం అయినందున రాష్ట్ర లేదా జాతీయ స్థాయిలో లేదా వారి సంబంధిత రంగంలో ఇప్పటికే ఏదైనా అవార్డు పొందిన వ్యక్తిని కూడా పరిగణనలోకితీసుకోవడం జరుగుతుందని, సమాజంలోని బలహీన వర్గాలైన మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, దివ్యాంగులు మొదలైన వారిలో ప్రతిభావంతులను గుర్తించడానికి ఇది ఒక మంచి అవకాశం అని పేర్కొన్నారు. డాక్టర్లు శాస్త్రవేత్తలు మినహా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసేవారు పద్మ అవార్డులకు అర్హులు కారని తెలిపారు. జిల్లాలో పైన పేర్కొన్న రంగాలలో అత్యున్నత, విశిష్ట సేవలు అందించిన వారు జూలై 31, 2025 లోగా రాష్ట్రపతి పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా పద్మ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని, ముఖ్యంగా మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, దివ్యాంగుల లో ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం

**భువనగిరి జిల్లా బ్యూరో**



అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది. 5:45 నిమిషాలకు శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకు వచ్చారు. ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగం ధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వర్ణగిరి క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రం లో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచా మృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు. ఉదయం 10:30 లకు విశ్వేశ్వ రుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 4000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరిం చారు. సాయంత్రం 6:30కు ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు.

సూర్య
www.suryaa.com



## పట్టు వస్త్రాలు బహుకరణ



యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంనకు భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత వ్యాపారి బొడ్డు శ్రీధర్ నవీన్ వారు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి విశేష పూజల్లో వినియోగించడానికి సుమారు లక్షా 50 విలువ చేసే కంచి పట్టుచీరలను దేవస్థానం అధికారులకు అందజేశారు.

## విద్యుదాఘాతంతో పాడి గేదే మృతి



అడ్డగూడూర్ మేజర్‌న్యూస్ ః యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలంలోని చిన్నపడిశాల గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం పాడి గేదే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. బాధిత రైతు కొమ్మనబోయిన రవి తెలిపిన వివరాల ప్రకారం శనివారం రోజువారీ మాదిరిగా పాడి గేదేను మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు ప్రమాదవశాత్తు కాలుకు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని రైతు వాపోయారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా విద్యుత్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రైతు కొమ్మనబోయిన రవి పాడి గేదే సుమారు రూ.90,000 ఉంటుందని ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.

## ఘనంగా ప్రపంచ బ్లడ్ డోనర్స్ డే

నల్గొండ జిల్లా బ్యూరో

శుక్రవారం ఉదయం 10 గంటలకి రాజ్ భవన్ సంస్కృతి హోల్ నందు రాష్ట్రంలో రక్తదాన శిబిరాలు నిర్వహించిన వారిని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాజ్ భవనలో నల్గొండ జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ కి 2000 పైగా బ్లడ్ డోనర్స్ తో బ్లడ్ క్యాంపు నిర్వహించినా బ్లడ్ అందించిన దివిస్ ల్యాబొరేటరీ చౌటుప్పల్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ ఐఏఎస్ స్టేట్ జనరల్ సెక్రటరీ శ్రీరాములు పాల్గొన్నారు ఈ సందర్భంగా నల్గొండ రెడ్ క్రాస్ చైర్మన్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ అధ్యక్షులు ఇలా త్రిపాఠి సూచనతో నల్గొండ రెడ్ క్రాస్ చేస్తున్న వివిధ సామాజిక సేవ కార్యక్రమాల, యూత్ రెడ్ క్రాస్ వైఆర్‌సి, జెఆర్‌సి ద్వారా చేస్తున్న సేవలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ చైర్మన్, జిల్లా మేనేజింగ్ కమిటీనీ యూత్ వాలంటీర్స్‌ని అభినందించారు. ఈ సందర్భంగా స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ మందడి నర్సిరెడ్డి జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మేనేజింగ్ కమిటీ సభ్యులు సూరెడ్డి సరస్వతి బుక్క ఈశ్వరయ్య జల్లా దశరథ ఊరుకొండ ప్రభాకర్ రెడ్డి కంబపాటి కోటేశ్వరరావు డాక్టర్ సుచరిత తదితరులుహర్షం వ్యక్తం చేశారు.



## రక్తదాత నవీన్‌కు సన్మానం





మోత్కూర్, మేజర్‌న్యూస్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని మాతృదేవో భవ పితృదేవోభవ సంస్థ ద్వారా గత ఆరు సంవత్సరాలు పైగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తం అవసరమైన వారికి ఇప్పిస్తూ, రక్తదానం చేస్తూ, వారి మిత్రులతో రక్తదానం చేయిస్తున్నటువంటి పాటిమట్ల గ్రామానికి చెందిన కురుమేటి నవీన్‌ను నార్కట్‌పెల్లి కామినేని హాస్పిటల్, నల్లగొండలోని రక్షా బ్లడ్ బ్యాంకులో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ రక్త కొరత లేని సమాజాన్ని నిర్మించడానికి తమ సంస్థ ద్వారా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు రక్తదానాన్ని అలవాటుగా చేసుకొని ఒక నిండు ప్రాణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ యాజమాన్యం డాక్టర్ దివ్య ప్రపుల్ల, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ స్వాతి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది గౌతం, సైదులు, అనిత సంస్థ సభ్యులు శ్రీమన్ యాదవ్, కట్ట ప్రహ్లాద్, బోడ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజహితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమతత్వం




మోత్కూర్, మేజర్‌న్యూస్ : సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ఉద్యమతత్వం అని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇన్ చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు. శనివారం మోత్కూర్‌లో కూరెళ్ళ శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించిన మోత్కూర్, అడ్డగూడూరు మండలాల ఎమ్మార్పీఎస్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణంను కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని అన్నారు. ఎస్సీ సమాజానికి దక్కవలిసిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే మరోవైపు నిరాదరణకు గురైన వర్గాలైన వికలాంగులు, వృద్దులు, వితంతువుల కోసం పోరాడి వారికి పెన్షన్లు సాధించడం జరిగిందన్నారు. గుండె జబ్బుల చిన్నారులకు ఉచిత ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ పథకం, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెలంగాణ అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, మహిళ భద్రత కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, తెల్ల రేషన్ కార్డు ప్రజలకు 6 కిలోల బియ్యం పెంపు మొదలగు ఫలితాలను ఎమ్మార్పీఎస్ సాధించిందని వివరించారు. ఈ ఫలాలు కేవలం మాదిగల కోసం చేసినవి కావని , అన్ని వర్గాల సంక్షేమం సామాజిక బాధ్యతతో చేసిన ఉద్యమాలని అన్నారు. జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మోత్కూరు, అడ్డగూడూరు మండల అధ్యక్షులు గజ్జెలి వినోద్, సూరారపు రాజు మాదిగ, పట్టణ అధ్యక్షుడు సతీష్, నరేష్, కందుకూరి ప్రకాష్, సుంకిశాల యాదగిరి, వస్తుప్పుల కృష్ణ, వడ్డేపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి ఏజెంట్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

### భారతీయ మజ్దూర్ సంఘ్ దేవరకొండ అధ్యక్షుడుగా ఏర్పుల శ్రీనివాస్

### మాల్ అధ్యక్షులుగా నరసింహ గౌడ్



చింతపల్లి, మేజర్‌న్యూస్ : భారతీయ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి ఏజెంట్ల సంఘం ఎన్నికలు శుక్రవారం సాయంత్రం జరిగినాయి. భారతీయ మద్దూర్ సంఘం ఆధ్వర్యంలో ఏజెంట్లు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరకొండ భారతీయ మజ్దూర్ సంఘం ఎల్ఐసి ఏజెంట్ అధ్యక్షులుగా ఏర్పుల శ్రీనివాస్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా మాల్ సాటిలైట్ ఆఫీస్‌కు బిఎంఎస్ మాల్ పట్టణ అధ్యక్షుడిగా ముద్దం నరసింహను, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బి ఎంఎస్. ఆల్ ఇండియా సెక్రెటరీ పనింద్ర కుమార్, ఆల్ ఇండియా కోశాధికారి జగదీష్ కుమార్, అదేవిధంగా సత్యనారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాలస్వామి, ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు. సమావేశాలకు ముందు చింతపల్లి సాయిబాబా దేవాలయంలో ఏజెంట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ సంఘ్ దేవరకొండ మాల్ అడ్‌హక్ కమిటీ



చింతపల్లి, మేజర్‌న్యూస్ : భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ సంఘ్ దేవరకొండ, మాల్, నూతన అడాక్ కమిటీ (భారతీయ మజ్దూర్ సంఘ్)ని శుక్రవారం చింతపల్లి సాయిబాబా దేవాలయంలో 32 మంది ఏజెంట్ల సభ్యత్వం తీసుకున్నారని వారి సమక్షంలో నిర్వహించగా, చైర్మన్ వైస్ చైర్మన్ కోశాధికారి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. దేవరకొండ ఎల్ఐసి బ్రాంచ్ చైర్మన్‌గా ఏర్పుల శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా మద్దెల వెంకటయ్య, కోశాధికారిగా చిత్త నూరి రంగయ్య, సభ్యులుగా బెక్కం శ్రీనివాస్, ఫయాజ్ అహ్మద్, జటావత్ బాలు వి.శంకర్, సంగిరెడ్డి రవీందర్ రెడ్డి, ఎన్నిక కాగా మాల్ బ్రాంచ్ చైర్మన్గా ముద్దం నరసింహ, వైస్ చైర్మన్‌గా ఆకుతోట. నరసింహ, కోశాధికారిగా షేక్ సలీం ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఫణీంద్ర కుమార్ హాజరై మాట్లాడుతూ ఏజెంట్ల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తు కార్య చరణ తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏర్పుల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గున్న రామ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కాయితి బుచ్చిరెడ్డి సపవట్ నిరంజన్, బెజవాడ శేఖర్, ఆల్ ఇండియా నాయకులు జగదీష్, సత్యనారాయణ రెడ్డి భాస్కర్ రెడ్డి, బాలస్వామి, బి.ప్రభాకర్ సైదులు కంభంపాటి అంజయ్య, షణ్ముఖ చారి, విజయ్ కుమార్, వై.వెంకట్ రెడ్డి, కటికర్ల పర్వతాలు, నీల లక్ష్మయ్య, బుచ్చయ్య టీచర్, జక్కుల రమేష్, ఇమ్మడి భద్రయ్య, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై డ్రైనేజీ నీరు...

# ఇబ్బందులు పడుతున్న ప్రజలు

## పారిశుధ్యంను మెరుగు పరచాలి

## సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలన



మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : ప్రధాన మురికి కాలువ డ్రైనేజీ నిండి మురికి నీరు రోడ్లపై వచ్చి ప్రజలకు ఇబ్బందులు పెడుతుందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా రోడ్లపై పారుతున్న డ్రైనేజీ నీరు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీని సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ లో ఉన్న మరుగుదొడ్ల నీరు ప్రధాన డ్రైనేజీ ద్వారా ప్రధాన మురికి కాలువలో కలిపారని డ్రైనేజీ నిండిపోవడంతో మురికి నీరు రోడ్లపైకి వచ్చి చేరుతుందన్నారు. గత వారం రోజులుగా రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంబేద్కర్ చౌరస్తా కొబ్బరి బొండాల షాపు వద్ద నుండి మురికి నీరు రోడ్డు వెంట శరత్ బాబు హాస్పిటల్ వరకు వెళుతుందని రోడ్డుపై రోడ్డు కిరువైపులా మురికి కాలువల దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. అటుగా వచ్చి వెళ్లే పాదాచారులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో మురికి నీరు పాదాచారులపై పడుతుందని తెలిపారు. వారం రోజులుగా మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు మున్సిపల్ అధికారుల పరిధిలో పై పట్టణ ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరును అరికట్టి డ్రైనేజీని శుభ్రపరిచి రోడ్లపై నీరు ప్రవహించకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టూ టౌన్ కార్యదర్శి భావండ్ల పాండు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, రేమిడాల పరుశురాములు, అయూబ్, హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి, సీనియర్ నాయకులు సత్యనారాయణ రావు,నాయకులు పాపిరెడ్డి, రవి నాయక్ పాల్గొన్నారు.

# పులిగిల్ల శివ నాగేందర్

# గుప్తాకు ఘన సన్మానం



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : తిరుపతి శ్రీవారి సన్నిధి బిల్డింగ్ సొసైటీ కార్యవర్గం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆర్యవైశ్య నాయకుడు శివనాగేందర్ గుప్తాను యాదగిరిగుట్టలో శనివారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన ధార్మిక పరిషత్ అధ్యక్షులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి అనంతరం వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి శ్రీవారి సన్నిధి బిల్డింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శివ నాగేందర్ గుప్తా రాజకీయ, వ్యాపార రంగంలో రాణిస్తూ సేవా రంగంలో మంచి గుర్తింపు పొందిన శివ నాగేందర్‌కు రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు వరించాలని కోరుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నువ్వుల రమేష్, లెంకలపల్లి శ్రీనివాస్, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రస్తుతం ఉన్న పాఠశాలలను సెమి రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలి

## - పర్యవేక్షణ అధికారుల పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలి

## - చావా రవి టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు టీఎస్ యుటిఎఫ్

భువనగిరి జిల్లా బ్యూరో




యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సమావేశము తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భువనగిరి నందు జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చావ రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని, అదేవిధంగా ప్రస్తుతం ఉన్న గురుకుల పాఠశాలలో డే పాఠశాలలుగా మార్చడం సరైనది కాదని అన్నారు. పర్యవేక్షణ పోస్టులైన డిప్యూటీ ఈవో పోస్టులను ప్రస్తుతం ఉన్న సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వాలని, వారిని ప్రమోషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఇటీవల మన రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రం మొత్తంలో 210 పాఠశాలలో మాత్రమే ఫ్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించడానికి అనుమతి ఇచ్చారని, అందులో నర్సరీ, ఎల్కేజీ లేకుండా యూకేజీ నుండి మాత్రమే ప్రారంభిస్తామని ఆ ఉత్తర్వులలో పేర్కొనడం జరిగినదని, అది కూడా సరియైనది కాదు అని, ఫ్రీ ప్రైమరీ తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ నర్సరీ నుండి ప్రారంభించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమిస్తేనే విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని అన్నారు. అదేవిధంగా పిఆర్సి రిపోర్టును వెంటనే తెప్పించుకొని తగిన ఫిట్మెంట్తో పిఆర్సి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాకయ్య మాట్లాడుతూ ఐదు డిఏలు పెండింగ్లో ఉంటే ఒక్క డిఏ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఇది ఏమాత్రం సరైనది కాదని వెంటనే మూడు డిఏలను ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముక్కెర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, ఉపాధ్యక్షులు వెంకటాచారి, ఉపాధ్యక్షురాలు మమత, కోశాధికారి ముత్యాలు, జిల్లా కార్యదర్శులు దొడ్డి స్వామి, కంచి రవి కుమార్, శ్రీదేవి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జూకంటి కరుణాకర్, వివిధ మండలాల బాధ్యులు యాదగిరి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్, సుదర్శన్, మురళి, మల్లేష్, వెంకటేశ్వర్లు, వెంకటేష్, వెంకట్రాం రెడ్డి, రవీందర్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసై

# గంధ మల్ల రవి ఆత్మహత్య



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లోని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నివాసంపైన టెర్రస్ లో ఎమ్మెల్యే ఇంట్లో పని చేసే గంధమల్ల రవి(30)అనే వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. ఎమ్మెల్యే ఇంట్లో పనిచేస్తూ ఎమ్మెల్యే ఇంట్లోని బిల్డింగ్ పైన కుటుంబ సభ్యులతో నివాసం ఉండే గంధమల్ల రవి ఎవరు లేని సమయంలో టెర్రస్ పైన ఉన్న రేకుల షేడ్ కు శాలువతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను భువనగిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పరామర్శించారు.

# పేద ప్రజల అభివృద్ధే ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ధ్యేయం


## - లయక్ అహ్మద్

భువనగిరి జిల్లా బ్యూరో



బోనగిరి పట్టణంలోని 30వ వాడు పహాడీనగర్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి.లయిక్ అహ్మద్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద వాడి కల సాకారం చేసిన స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. మొట్ట మొదటి సారిగా వార్డులో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలని లబ్దిదారుడు తెలిపారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని లయిక్ అహ్మద్ తెలిపారు. మంజూరు అయిన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం తొందరగా చేపట్టాలని కోరారు. ఇంకా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానీ వారికి ఎమ్మెల్యేతో మాట్లాడి ప్రతి ఒక్క పేద వానికి ఇంటి నిర్మాణ ఋణం మంజూరు చేఇస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఆఫీసర్ శ్రీకాంత్, షైక్ గౌస్ లబ్దిదారులకు మన్సూర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిత్య కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు





యాదగిరి కొండ, మేజర్‌న్యూస్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మినరసింహస్వామి పుణ్య క్షేత్రంలో శనివారం భక్తులు సెలవు దినం కావడంతో స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ధర్మ దర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంటన్నర సమయం పడుతుంది. ప్రధానాలయంలో నిత్య ఆరాధనలు, కళ్యాణంతో పాటు, సుదర్శన నరసింహ హెూమం పర్వాలు శాస్త్రపరంగా జరిగాయి. సుప్రభాతంతో పంచనారసింహులను మేలుకొల్పి పూజారులు ఆరతి నివేదన జరిపి ఉత్సవమూర్తులను పంచామృతంతో అభిషేకించారు. దర్శనమూర్తులకు స్వర్ణపుష్పార్చన జరిపి అలంకరించారు. వేదమంత్రాలతో సుదర్శన నారసింహ హెూమం జరిగింది. విశ్వక్సేన ఆరాధనతో పాంచరాత్ర ఆగమశాస్త్రనుసారంగా నిత్య కళ్యాణం చేపట్టారు. సాయంత్రం అలంకార సేవ ప్రతిష్టామూర్తులకు ఆరాధన జరిపారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారికి ఆరగింపు అనగా నివేదన తదుపరి ద్వారబంధన అనగా ఆలయము మూసి వేయబడును.

సూర్య
15-06-2025 ఆదివారం

# కేసుల పరిష్కారానికి లోక్ దాలత్ చక్కని మార్గం



కోదాడ, మేజర్‌న్యూస్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి మార్గమని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు డబ్బు,సమయం ఆదా అవుతాయి అన్నారు.రాజీ మార్గమే రాజ మార్గమని కక్షలు, పట్టింపులకు పోయి కక్షి దారులు నష్ట పోవద్దని సూచించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసులతోపాటు రాజీ పడదగిన అన్ని కేసులు పరిష్కారం చేసారు. కోదాడలోని అన్ని కోర్టులలో క్రిమినల్ కేసులు 354, సివిల్ కేసులు 5, నేరం ఒప్పుకున్న కేసులు 45, బ్యాంక్ కేసులు 65 ద్వారా 56లక్షలు రూపాయలు ,జరిమాన ద్వారా 1లక్ష 90వేల రూపాయలు, ఎస్ టి సి కేసులు 764 ద్వారా 25వేల రూపాయలు వసూలు అయినట్లు తెలిపారు. ఇలా వివిధ రకాల కేసులు మొత్తం1233 కేసులు ఈ లోక్ అదాలత్ లో పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కోడూరు వెంకటేశ్వరరావు, యడ్లపల్లి వెంకటేశ్వర్లు, హుస్సేన్, కానుగు మురళి,ఏ పీ పీ సిలివేరు వెంకటేశ్వర్లు, ఆవుల మల్లికార్జున రావు వివిధ బ్యాంక్ ల మేనేజర్లు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి, ఆర్థిక సహాయం చేయాలి

## బిజెపి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్

యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : శనివారం యాదగిరిగుట్ట పట్టణ బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సమక్షంలో మీడియా సమావేశం జరిగింది. ఈ యొక్క సమావేశం బిజెపి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల యొక్క సొంత నివాసంలో అతని వ్యక్తిగత సహాయకుడు గంధ మల్ల రవి రాత్రి ఎమ్మెల్యే నివాసంలోని మూడంతస్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే సుమారు 12 గంటలు గడిచినా కూడా ఎలాంటి సమాచారం బయటకు పొక్కనీయకుండా ఎందుకు రహస్యంగా భువనగిరికి తరలించినారు. మరి ఆ సమయంలో పత్రిక వాళ్లకు ఏమన్నా తెలియజేశారా ఒక ప్రజాప్రతినితో ఇంట్లో ఇలాంటి ఘోరం జరిగినప్పుడు అధికారులకు, మీడియాకు తెలియజేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యే కి లేదా మరి ఏ కారణాలతో అతను ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చింది. ఆ వ్యక్తి యొక్క భార్య రాసి ఇచ్చిన ఫిర్యాదు పై కూడా బెదిరించి రాసినట్టు ఈ నియోజకవర్గ ప్రజలకు అనుమానంగా ఉంది. ఆ యొక్క వ్యక్తి మృతి మీద ప్రజలకి ఎన్నో అనుమానాలు ఉన్నాయి. ఈ విషయం లో పోలీసుల అత్యుత్సాహం కూడా కనిపిస్తుంది. ఆ సమయంలో ఉన్నటువంటి సీసీ కెమెరాలను పుటేజీని బయట పెట్టాలి. ఆ యొక్క కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదుకోవాలి. ఆ యొక్క మృతి మీద జ్యూడిషల్ విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇట్టి సమావేశంలో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, మండల మాజీ అధ్యక్షులు గుంటుపల్లి సత్యం ,పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజు నరేష్, జెల్ల భానుచందర్ సీనియర్ నాయకులు బండారపు మల్లేష్ గౌడ్ పట్టణ కార్యదర్శి ఆలేటి కర్ణ, మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్, శివరాత్రి శ్రీశైలం, శ్యామ్, సంద ప్రవీణ్ పాల్గొన్నారు.



## దశ దిన కర్మకు క్వింటాలు బియ్యం అందజేసి

# మానవత్వం చాటుకున్న బూడిద లింగయ్య యాదవ్



మునుగోడు, మేజర్‌న్యూస్ : మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన సత్తు రాములు ఇటీవల మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఓబిసి జిల్లా కాంగ్రెస్ నాయకులు బూడిద లింగయ్య యాదవ్ శనివారం సత్తు రాములు దశదినకర్మకు 100 కేజీల బియ్యం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మేకల మల్లయ్య యాదవ్, పాలకూరి యాదయ్య గౌడ్, పందుల భాస్కర్, పాల్వాయి జితేందర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, ఇంద్రారెడ్డి, ఏరుకొండ వెంకన్న ఆవుల శ్రీనివాస్ యాదవ్, దోటి శంకర్ పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో మిర్యాలగూడ పట్టణం

## రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండాలి

## సుందరీకరణలో పట్టణాన్ని తీర్చిదిద్దడానికి పారిశుద్ధ్య కార్మికులు అంకితభావంతో పనిచేయాలి

## శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశాలు





మిర్యాలగూడ టౌన్, మేజర్‌న్యూస్ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికుల పనితీరును శనివారం తెల్లవారుజామున 5 గంటలకు స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జవాన్లు, వాహన డ్రైవర్లతో సమావేశం నిర్వహించి పట్టణ పారిశుద్ధ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.పట్టణ పరిశుభ్రత విషయంలో గతంలో లాగా మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానంటూ హెచ్చరించారు. ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి పట్టణాన్ని స్వచ్ఛ మిర్యాలగూడగా ఉంచాలని సూచించారు.ఆలోచన మాత్రమే కాదు ఆచరణలో కుడా నేనున్నానంటూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడిగా చెత్త వాహనాన్ని నడుపుకుంటూ పట్టణంలోని గాంధీనగర్ కు వెళ్లి స్వయంగా ఎమ్మెల్యే చెత్తను సేకరించడం స్థానికులు ఆశ్చర్యానికి లోనవ్వడం జరిగింది.అనంతరం పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్ గణేష్ కూరగాయల మార్కెట్‌తో పాటుగా ఇతర ప్రాంతాలను కాలినడకన వెళ్లి పరిశీలించడం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అంటే దేవాలయం లాంటిదని దానిని మనం ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.పారిశుద్ధ్య విషయంలో బాధ్యతగా తమ విధులు నిర్వర్తించలేనివారు స్వచ్ఛందంగా తమవిధుల నుండి తప్పుకోవాలన్నారు.నిబద్ధతతో కూడిన బాధ్యతయుతంగా పనిచేసే కార్మికులకు మా నుండి ఎప్పుడు సహాయ సహకారాలతో అండగా ఉంటూ వారికి కావాల్సిన సదుపాయాలను ఎల్లప్పుడు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.మిర్యాలగూడను తెలంగాణ రాష్ట్రంలోనే స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్క పట్టణ పౌరులు భాగస్వాములు కావాలని కోరారు.

# యాదగిరిగుట్ట ఆలయములో భక్తులకు ప్రసాద వితరణ



యాదగిరిగుట్ట, మేజర్‌న్యూస్ : తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఐన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి వచ్చు భక్తుల సౌకర్యార్ధము ప్రతిరోజు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ఈవో వెంకట్రావు ఐఏఎస్ మొదటగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి వారములో ఆరురోజులు పులిహోర ప్రసాదము,ప్రతి శనివారము రోజున లడ్డూ ప్రసాద వితరణ నేడు శనివారం సందర్భంగా లడ్డు ప్రసాదం భక్తులకు వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు ఐఏఎస్ ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆలయ అర్చకులు, అధికారులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 7వ వార్డులో 100 రోజుల కార్యక్రమం

**భువనగిరి జిల్లా బ్యూరో**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 13వ రోజు అయినందున భువనగిరి పురపాలక సంఘంలో శ్రీయుత మున్సిపల్ కమిషనర్ రామలింగం ఆదేశానుసారం పట్టణంలోని స్థానిక 7వ వార్డు యందు ఉన్నటువంటి మురికి కాలువల యొక్క పూడిక తీత పనులను చేయించడం జరిగింది. వివిధ వార్డులలో ప్రతి ఇంటింటికి తిరిగి తడి పొడి చెత్తలను వేరు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించడం జరిగింది. అంతేకాకుండా దోమల నివారనికి మురికి కాలువలపై పిచికారి చేయించడం జరిగింది. ఇటి కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్, హెల్త్ అసిస్టెంట్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సమస్యల పై భువనగిరి మండలంలో రెవెన్యూ సదస్సులు

## – తహశీల్దార్ అంజిరెడ్డి

**భువనగిరి జిల్లా బ్యూరో**



భువనగిరి మండలంలోని వివిధ గ్రామాలలో భూ భారతి రెవిన్యూ సదస్సులు షెడ్యూల్ 16వ తేదీన వీరవెల్లి, బస్వాపురం 17వ తేదీన బండసోమారం, హుస్సే నాబాధ్, 18వ తేదీన అనంతారం, రామచంద్రపురం, 19వ తేదీన రాయగిరి, చీమల కొండూరు 20వ తేదీన భువనగిరి, బొమ్మాయిపల్లి గ్రామాలలో జరుపబడును. కావున ఆయా గ్రామాలలోని రైతులందరూ తమ భూ సమస్యలపై రెవిన్యూ సదస్సులలో తగిన ఆధారాలతో దరఖాస్తులను సమర్పించవలసినదిగా కోరారు.